సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. 363 టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చాయి.



కిలో టమాట రూ.16.50
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16.50, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/22.6°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

సెంట్రల్ యూనివర్సిటీలో అడ్మిషన్లు పూర్తి



అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మూడో దశ యూజీ, పీజీ అడ్మిషన్లు పూర్తయినట్లు వీసీ ఎస్ఏ కోరి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మూడో దశ అడ్మిషన్లు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు పాటించి పకడ్బందీగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల అడ్మిషన్ల జాబితాను సెంట్రల్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

నేటి నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ శుక్రవారం ప్రారంభం కానుంది. 2,66,660 మంది లబ్ధిదారులకు సంబంధించి పింఛన్ సొమ్ము మొత్తం రూ.74,04,32,250 ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల చేతికి ప్రభుత్వం అందజేసింది. నగదు పంపిణీ 5 రోజులు ఉంటుంది.

భూముల రీసర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న భూరక్ష–భూసర్వే' పథకంలో నిర్వహించనున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని ఆర్డీఓ భాగ్యరేఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలోని ఓ కల్యాణమండపంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో సర్వే సాగుతోందన్నారు. ప్రక్రియ పూర్తయితే రికార్డులు పక్కాగా ఉంటాయన్నారు. పూర్తి స్థాయి హద్దులు చూపించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది రికార్డుల స్వచ్ఛీకరణ చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, డీఐలు శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, సర్వే సూపరింటెండెంట్ క్రాంతికుమార్, డీటీలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

హౌస్ కీపింగ్‌పై శిక్షణ, ఉపాధి అవకాశాలు

పుట్టపర్తి అర్బన్: హౌస్‌కీపింగ్, కేర్‌టేకింగ్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. కనీసం 5వ తరగతి చదివి చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9177164971, 9398643930 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చౌకదుకాణాల ద్వారా గోధుమ పిండి పంపిణీ



గోధుమ పిండి ప్యాకెట్

పుట్టపర్తి అర్బన్: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా చౌకదుకాణాల ద్వారా గోధుమపిండి పంపిణీకి చర్యలు తీసుకుంది. మూడు నెలల నుంచి కార్డుదారులకు ఉచితంగా రాగులు అందజేసిన ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుంచి చిక్కీ గోధుమపిండిని సబ్సిడీపై అందజేయడానికి సమాయత్తమైంది. బహిరంగ మార్కెట్‌లో కిలో గోధుమపిండి రూ.50 నుంచి రూ. 80 పలుకుతుండగా కేవలం రూ.16కే అందజేయనుంది. జిల్లాలో 32 మండల కేంద్రాలు, 6 మున్సిపాలిటీల్లో గోధుమ పిండి పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ముందుగా సుమారు 2 లక్షల కార్డులకు ప్రయోగాత్మకంగా పంపిణీ చేస్తామని, భవిష్యత్తులో అన్ని గ్రామాల్లో అందజేస్తామని వివరించారు.

'తమ్ముళ్ల' బరితెగింపు

- ధర్మవరానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తిని ఈ ఏడాది ఫిబ్రవరిలో టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ అనుచరులు కిడ్నాప్ చేశారు. పొలం రాసివ్వకుంటే చంపేస్తామని బెదిరించారు. భయపడిన వెంకటరమణ వారు చెప్పినట్లే చేస్తానని ఒప్పుకొన్నారు. ఈ క్రమంలోనే కిడ్నాపర్ల నుంచి బయటపడిన ఆయన పోలీసులను ఆశ్రయించారు. తన భూమిని బలవంతంగా కాజేసేందుకు కిడ్నాప్ చేసి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిటాల శ్రీరామ్ అండ చూసుకుని రెచ్చిపోతున్నారని వాపోయారు.
- బత్తలపల్లి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా ఉన్న బగ్గిరి బయ్యపురెడ్డికి చెందిన చీనీ చెట్లను ఈ ఏడాది జూలై 31న గుర్తు తెలియని దుండగులు నరికేశారు. తాడిమర్రి మండలం ఎం. అగ్రహారం వద్ద ఉన్న పొలంలో 150 చెట్లను నేలకూల్చారు. స్థానికంగా ఉండే కొందరు టీడీపీ నాయకులు రాజకీయంగా తనను ఎదుర్కొనే ధైర్యం లేక పిరికిపంద చర్యలకు పాల్పడినట్లు బయ్యపురెడ్డి తెలిపారు.
- వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని ఈ ఏడాది ఏప్రిల్ 1న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సవాల్ విసిరారు. దీన్నే ఆసరాగా తీసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి దాడులకు పక్కా ప్రణాళికలు రచించారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో వచ్చి నానా యాగీ చేశారు. ముందస్తు ప్లాన్ ప్రకారం పుట్టపర్తిలోని సత్యమ్మగుడి వద్ద కారుపైకి ఎక్కి తొడగొడుతూ మీసం మెలేస్తూ అల్లర్లకు దిగారు. టీడీపీ నేతల దురుసుతనంతో చాలామంది అమాయకులు గాయపడ్డారు.



నరికేసిన చీనీ చెట్లను పోలీసులకు చూపుతున్న వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి మండల కన్వీనర్ బగ్గిరి బయ్యపురెడ్డి (ఫైల్)



టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ దళితుడు బేల్దారి నాగేంద్ర

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెరుగుతున్న దుశ్చర్యలు
- ఓటమి భయంతో వైఎస్సార్ సీపీ నాయకులు, సామాన్యులపై దాడులు
- ప్రత్యర్థి పార్టీ వారి ఆస్తులు ధ్వంసం చేసి రాక్షసానందం
- జిల్లావ్యాప్తంగా అలజడులకు యత్నం
- పార్టీ హైకమాండ్ ఆదేశాలతోనే ఆగడాలు ఎక్కువయ్యాయనే అనుమానాలు

సాక్షి, పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నారు. ముఖ్య నాయకుల అండతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలనే కాకుండా సామాన్యులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథకాలతో వైఎస్ జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం దూసుకుపోతుండడాన్ని ఓర్వలేక దాడులకు తెగబడుతున్నారు. ఉనికి కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రజాదరణ కోల్పోవడంతో గొడవలు, అల్లర్లకు పాల్పడి అయినా ప్రజల దృష్టిని తమ వైపు తిప్పుకునేందుకు విధ్వంసాలకు సైతం పూనుకుంటున్నారు.

హైకమాండ్ ఆదేశాలతోనే..!
'వీలైనన్ని ఎక్కువ కేసులుంటేనే పార్టీలో గుర్తింపు ఉంటుంది. అలాంటి వారికే మంచి పదవులు కట్టబెడతాం.' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇటీవల ఓ సభలో వ్యాఖ్యానించారు. ఆయన తండ్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అయితే స్వయంగా చిత్తూరు జిల్లా పుంగనూరు వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు, పోలీసులపై దాడులకు దగ్గరుండి ఉసిగొల్పారు. దీంతో గొడవలు చెలరేగి అక్కడ బందోబస్తులో ఉన్న ఎంతోమంది పోలీసులు గాయపడ్డారు. ఓ కానిస్టేబుల్ కంటి చూపు కూడా కోల్పోయారు. దీన్ని బట్టి చూస్తే హైకమాండ్ ఆదేశాలతోనే జిల్లాలోనూ తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతోంది. మంచి.. చెడు తేడా తెలియకుండా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలనే కాకుండా సామాన్య ప్రజలను కూడా ఇబ్బందులకు గురిచేస్తూ రాక్షసానందం పొందుతున్నట్లు స్పష్టమవుతోంది. రెండు రోజుల క్రితం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన బేల్దారి నాగేంద్రపై కొందరు టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచడం ఈ కోవకే వస్తుంది. పని కాంట్రాక్టు విషయంలో తలెత్తిన చిన్న సమస్యను ఆసరాగా చేసుకుని ఓ సామాన్యుడిపై మూకుమ్మడి దాడికి దిగి గాయపరిచారంటే వారు ఎంతగా రెచ్చిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

గత రాక్షస పాలనను గుర్తు చేస్తున్న వైనం..
టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అడ్డూ అదుపు లేకుండా 'తమ్ముళ్లు' రెచ్చిపోయేవారు. అధికారుల నుంచి సామాన్యుల వరకూ దౌర్జన్యం చేసేందుకు వెనుకాడే వారు కాదు. ఎమ్మార్వోలు, మహిళలు, పోలీసులు, ఉపాధ్యాయులు.. ఎవరైనా సరే తమకు అడ్డు చెబితే చాలు దాడి చేసిన ఘటనలు కోకొల్లలు. అయితే, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేసింది. దౌర్జన్యాలు, దోపిడీలను ఎక్కడికక్కడ అరికట్టింది. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల ఆగడాలకు కళ్లెం వేసింది. అయితే, ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పార్టీ పెద్దల ఆదేశాలతో ఇటీవల మళ్లీ వారు రెచ్చిపోతున్నారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. గత రాక్షస పాలనను గుర్తు చేస్తూ ఆనందం పొందుతున్నారు.

పారదర్శకంగా నియామకాలు

పుట్టపర్తి అర్బన్: మాతా శిశు సంరక్షణా కార్యాలయ పరిధిలో ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా చేపడతామని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 18వ తేదీన విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి జిల్లా కో ఆర్డినేటర్ పోస్టుకు 34 దరఖాస్తులు, జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పోస్టుకు 26, బ్లాక్ కో ఆర్డినేటర్ పోస్టులకు సంబంధించి ఓడీసీకి 26, హిందూపురం 19, మడకశిర 23 కలిపి మొత్తం 128 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులు పరిశీలిస్తే 39 మాత్రమే పోస్టులకు అర్హత ఉన్నట్లు తేలిందన్నారు. త్వరలో కంప్యూటర్ పరిజ్ఞానంపై పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

ప్రశాంతి నిలయం: వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని డీఈఓ మీనాక్షి అన్నారు. గురువారం కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా సెకండరీ స్కూల్ అథ్లెటిక్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ విద్యార్థి మానసిక, శారీరక సామర్థ్యాలను పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. క్రీడల్లో ప్రభుత్వ విద్యార్థులు సత్తా చాటేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. నియోజకవర్గాల వారీగా గ్రిగ్స్ పోటీలు నిర్వహించి ప్రతిభ వెలికితీయాలన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శిగా సందీప్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మొరార్జీ యాదవ్, కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయం'పై దృష్టి సారించండి

- 80 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ
- జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సూచన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు

కదిరి: పెసరు, ఉలవ, అలసంద వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సూచించారు. గురువారం కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల స్థితిగతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2.84 లక్షల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి 99 వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారన్నారు. ఆ పంటలు కూడా వర్షాభావ పరిస్థితులతో ఎండుముఖం పట్టాయని తెలిపారు. వేరుశనగ, కంది, ఆముదం పంటల సాగుకు సమయం దాటిపోయిందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో వర్ష సూచనలున్నాయని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం విత్తనాలను సిద్ధం చేసిందని, 80 శాతం సబ్సిడీతో అందిస్తామని తెలిపారు. వ్యవసాయాధికారులతో పాటు శాస్త్రవేత్తలు సమష్టిగా రైతులకు సహకరించాలని కోరారు. ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎండుతున్న వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు లీటర్ నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 20 గ్రాముల యూరియా లేదంటే 5 గ్రాముల 19–19–19 రకం ఎరువు 1 లీటర్ నీటితో కలుపుకొని వారం రోజుల వ్యవధిలో వర్షం పడే వరకూ పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వేమన మాట్లాడుతూ పంట పరిసరాల్లో వయ్యారిభామ (పార్థీనియం) మొక్కలు లేకుండా చూసుకోవాలని, వాటి మూలంగానే పంటకు తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. వేరుశనగ పంట చుట్టూ అలసంద, ఆముదం వంటి మేరసాలు పంటలు సాగు చేసుకుంటే వేరుశనగకు తామర పురుగు పట్టదని పేర్కొన్నారు. అన్ని రకాల పంటలకూ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని తలుపుల మండల అగ్రి అడ్వైజరీ బోర్డు అధ్యక్షుడు చెన్నక్రిష్టారెడ్డి పేర్కొన్నారు. పంటల సాగుపై ఎప్పటికప్పుడు రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయాధికారులతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు కలిసి బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. అంతకు ముందు జిల్లాలోని ఏడీఏలు తమ పరిధిలోని వివిధ రకాల పంటల సాగు వివరాలు వివరించారు. సమావేశంలో పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు డా.ప్రసన్నరాజేష్, డా.చంద్రాయుడు, డా.నీలిమ, డా.వెంకటరమణ, కృషి విజ్ఞానకేంద్ర, ఏరువాక శాస్త్రవేత్తలు డా.రామసుబ్బయ్య, డా.రాధాకుమారి, డా.కిషోర్, శశికళ, శిరీషా, పలువురు ఏడీఏలు, ఆదర్శరైతులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ వర్షం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో శ్రీజ మిల్క్ డెయిరీ వద్ద ఓ వేప వృక్షం కుప్పకూలింది. ఆటోపై పడడంతో దాని ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని బాధిత ఆటో డ్రైవర్ రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.



ఆటోపై కూలిన వృక్షం



జేసీబీ సాయంతో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పెట్టుబడి తగ్గేలా.. పంట దక్కేలా

రైతులకు పంట సాగు పెట్టుబడులను తగ్గించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. సులభ పద్ధతిలో ఎక్కువ లాభాలు సాధించేలా ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేలా యూరియాను ద్రవరూపంలో తీసుకొచ్చాయి. అందుబాటు ధరల్లో జిల్లాలోని నాలుగు మండలాల ఆర్బీకేల్లో వీటిని విక్రయిస్తున్నారు.

- రైతులకు అందుబాటులో నానో యూరియా
- లీటరు రూ.530 ప్రకారం విక్రయాలు
- 45 కిలోల యూరియాకు అరలీటర్ బాటిల్ సమానం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పంట కాలంలో సాధారణంగా రైతులు రెండు, మూడు సార్లు యూరియా వాడుతారు. ఇందులో ఉండే నత్రజని, అమ్మోనియా, నైట్రస్ ఆక్సైడ్, నైట్రేట్ రూపంలో నీరు, గాలి, నేలను కలుషితం చేస్తుంది. దీన్ని అధికంగా వాడడంతో తెగుళ్లు, కీటకాల దాడి ఎక్కువ కావడం, పంట పరిపక్వత ఆలస్యం కావడం, పోషకాల లోపం తలెత్తుతుంది. సంప్రదాయ యూరియాలో 20 నుంచి 30 శాతం మాత్రమే మొక్కకు అందుబాటులో ఉండి తక్కిన నత్రజని వ్యర్థమవుతుంది.



సమర్థవంతంగా నానో యూరియా...
ఎరువుల వేస్టేజీ ఎక్కువ లేకుండా మొక్కలకు సమర్థవంతంగా అందేలా కేంద్ర ప్రభుత్వం నానో యూరియాను తీసుకొచ్చింది. పంటలపై ఇది బాగా పని చేస్తుంది. నత్రజని మూలకాన్ని కావాల్సినంత అందిస్తుంది. సంప్రదాయ యూరియా అవసరాన్ని 50 శాతం మేర తగ్గిస్తుంది. నానో యూరియా పిచికారీ ద్వారా మొక్క వేర్లు వృద్ధి చెంది పిలకలు, కొమ్మలు బాగా పెరుగుతాయి. నేల, గాలి, భూమి కలుషితం ఎక్కువగా ఉండదు. సాధారణంతో పోలిస్తే అధిక దిగుబడి వస్తుంది. దీన్ని రైతులు సులభంగా రవాణా, నిల్వ చేయవచ్చు. ఈ క్రమంలో ఖర్చు తగ్గడంతో రైతులు ఆదాయం పొందవచ్చు. లీటరు నీటికి 2–4 మి.లీ. నానో యూరియా కలిపి ఆకులపై పిచికారీ చేసుకోవాల్సి ఉంటుంది. మంచి ఫలితాలు రావాలంటే రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. పిలకలు, శాఖలు ఏర్పడే సమయంలో ఒకటో స్ప్రే, ఆ తర్వాత 25 రోజులకు రెండో స్ప్రే పూతకు ముందు వాడాల్సి ఉంటుంది. వాడే ముందు నానో యూరియా బాటిల్‌ను బాగా కదిలించాలి.

సులభంగా తీసుకెళ్లొచ్చు



నానో యూరియా, నానో డీఏపీపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి తయారు చేయడంతో పంట పెరుగుదలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అర లీటరు నానో యూరియా బస్తా యూరియాతో సమానం. దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. కాలుష్యం కూడా బాగా తగ్గించవచ్చు. – సుబ్బారావు, డీఏఓ

సాయంత్రం వేళ పిచికారీ చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

ప్రయోగాత్మకంగా నాలుగు మండలాల్లో..
కేవలం అర లీటరు నానో యూరియా 45 కిలోల యూరియాతో సమానం. లీటరు నానో యూరియా బాటిల్ రూ.530, అర లీటరు రూ.265 ప్రకారం విక్రయిస్తున్నారు. జిల్లాలో 3,250 బాటిళ్లు నానో యూరియా అందుబాటులో ఉంది. పెనుకొండ, హిందూపురం, పరిగి, నల్లమాడ మండలాల్లోని ఆర్బీకేల్లో కొనుగోలు చేయవచ్చు.ప్రయోగాత్మకంగా వీటిని ప్రవేశపెట్టామని, విజయవంతమైతే అన్ని చోట్లా అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి..
చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే రైతులకు నానో యూరియా సురక్షితం. పిచికారీ సమయంలో మాస్క్‌లు, చేతి గ్లౌజులు వాడాలి. పిల్లలు, పెంపుడు జంతువులకు దూరంగా ఉంచాలి.

సాయి సన్నిధి.. వెల్లివిరిసిన బెంగాల్ సంస్కృతి



శ్రీకోల్ వాయిద్య కచేరీతో సత్యసాయికి నీరాజనం అర్పిస్తున్న కళాకారులు



కళాకారుడికి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రత్నాకర్ రాజు, చక్రవర్తి

ప్రశాంతి నిలయం: 'పర్తియాత్ర'లో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి చేరుకున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సత్యసాయి భక్తులు గురువారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో వారి సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకోల్ వాయిద్యంతో హరి కీర్తనలు ఆలపించి భక్తులను మైమరిపించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సత్యసాయి ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ఆ రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ప్రీతమ్ కుమార్ వివరించారు. అనంతరం కళాకారులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి నూతన వస్త్రాలతో పాటు జ్ఞాపికలను పంపిణీ చేశారు. కళాకారులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

పక్కాగా ఓటరు వెరిఫికేషన్

- జాయింట్ కలెక్టర్ సీహెచ్ చేతన్



చాగలేరు పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న జేసీ చేతన్

చిలమత్తూరు: ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని తహసీల్దార్ నాగరాజును జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం ఆయన చిలమత్తూరు మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ఉర్దూ పాఠశాల, సోమఘట్ట జెడ్పీహెచ్‌ఎస్, చాగలేరు ఎంపీయూపీ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి రేషనలైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

చాగలేరు ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యతను జేసీ చేతన్ పరిశీలించారు. స్వయంగా పిల్లలతో కలసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని సిద్ధం చేయాలని, నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడకూడదని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

వివాహిత బలవన్మరణం

కదిరి అర్బన్: మండలంలోని సున్నపుగుట్ట తండాకు చెందిన వివాహిత శ్రీదేవి (28) ఆత్మహత్య చేసుకుంది. తరచూ కడుపు నొప్పితో బాధపడే ఆమె బుధవారం అర్ధరాత్రి నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దీపిక.. విజయ పతాక



భారత జట్టుతో దీపిక బృందం



జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన దీపికను అభినందిస్తున్న కెప్టెన్ రూప



- అంధుల క్రికెట్‌లో రాణిస్తున్న అమరాపురం యువతి
- అంధుల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర

అమరాపురం: ఆమె ముందు వైకల్యం తలవంచింది. క్రీడా ప్రపంచం దాసోసహమంది. పట్టుదల, కృషి, కఠోర సాధన, క్రమశిక్షణతో అనుకున్న లక్ష్యం సాధించిందిన దీపిక.... ప్రపంచ అంధుల మహిళా క్రికెట్ టీ20లో భారత జట్టు విజయకేతనం ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించింది. యావత్తు దేశం గర్వించదగ్గ క్రికెట్ క్రీడాకారిణిగా ఖ్యాతిని సొంతం చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంబాలహట్టికి చెందిన దీపిక విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నిరుపేద కుటుంబంలో పుట్టి..

అమరాపురం మండలం హేమావతి పంచాయతీ తంబాలహట్టి గ్రామానికి చెందిన చిత్తమ్మ, చిక్క తిమ్మప్ప దంపతుల కుమార్తె టీసీ దీపిక ప్రస్తుతం బెంగళూరులోని విజయనగర కళాశాలలో డిగ్రీ చదువుతోంది. పుట్టుకతోనే దీపికకు 70 శాతం దృష్టి లోపం ఉంది. అయితే పేదరికం కారణంగా చిరు ప్రాయంలోనే ఆమెకు తల్లిదండ్రులు సరైన చికిత్స చేయించలేకపోయారు. కర్ణాటకకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామం కావడంతో దొడ్డబాణగెరలో కన్నడ మాధ్యమంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసింది. 4వ తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు ఆమె కంటి చూపుతో ఇబ్బంది పడుతున్నట్లుగా గుర్తించిన ఉపాధ్యాయులు వైద్య పరీక్షలు నిర్వహించి తుమకూరు జిల్లా కుణిగల్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. 5 నుంచి 7వ తరగతి వరకూ అక్కడే ఆమె చదువుకుంది. అనంతరం 8 నుంచి పదో తరగతి వరకూ మైసూరులోని రంగారావు మెమోరియల్ స్కూల్ ఫర్ డిసేబుల్డ్ పాఠశాలలో చదువుకుని, శిర తాలూకా బరగూరులో పీయూసీ పూర్తి చేసింది.



తల్లిదండ్రులతో దీపిక

క్రికెట్ అంటే మక్కువ..

మైసూరులోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నప్పుడు 2016లో పాఠశాల స్థాయి క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో తాను ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఏకంగా వంద పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన ఉపాధ్యాయులు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వచ్చారు. అదే ఏడాది బెంగళూరు వర్సెస్ మైసూరు జట్లు తలపడగా మరలా దీపిక 3 వికెట్లతో పాటు 78 పరుగులు చేసి తనలో దాగున్న ఆల్‌రౌండర్ ప్రతిభను వెలికి తీసింది. ద్వితీయ పీయూసీ చదువుతున్నప్పుడు బెంగళూరులోని ఐడీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో దీపిక సెంచరీతో కదం తొక్కి సమర్థనం సంస్థ నిర్వాహకుల దృష్టిని ఆకర్షించింది. దీపిక గురించి ఆరా తీసిన సంస్థ నిర్వాహకులు వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. దీపికకు క్రికెట్ శిక్షణ ఇప్పిస్తామని, ఇందుకు అయ్యే మొత్తం ఖర్చును సంస్థనే భరిస్తుందని భరోసానిచ్చారు. సంస్థ సహకారంతో క్రికెట్‌లోని మెలకువలపై పట్టు సాధించిన దీపిక ఆ తర్వాత వరుస రంజీ ట్రోఫీలో తన సత్తా చాటి భారత అంధుల మహిళా క్రికెట్ జట్టుకు కర్ణాటక రాష్ట్రం నుంచి ఎంపికైంది.

చరిత్ర సృష్టించిన అంధుల మహిళల క్రికెట్ జట్టు..

గత నెల ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన అంధుల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, భారత జట్లు తలపడ్డాయి. ఇందులో ఫైనల్స్‌కు చేరుకున్న భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. ఇంతలోనే వర్షం రావడంతో మ్యాచ్‌ను న్యాయనిర్ణేతలు భారత జట్టుకు 9 ఓవర్లలో 45 పరుగులు చేయాలని నిర్ణయించారు. బ్యాటింగ్ ప్రారంభంలోనే వికెట్ పడడంతో భారత క్రీడాకారులు కంగారు పడ్డారు. ఆ సమయంలో కెప్టెన్ వర్ష సరైన నిర్ణయం తీసుకుంటూ దీపికను రెండో స్థానంలో బ్యాటింగ్ చేయాలని పంపారు. తనపై కెప్టెన్ ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా దీపిక 8 బంతుల్లో 22 పరుగులు చేసి, అజేయంగా నిలుస్తూ భారత జట్టు గెలుపులో కీలకంగా మారింది.

అమ్మనాన్నల ప్రోత్సాహం మరువలేనిది

చిన్నప్పుడే కంటి చూపుతో బాధపడుతున్న నేను అన్నింటా ముందుండాలంటూ అమ్మ, నాన్న ప్రోత్సహించడం మరువలేను. వారి వల్లనే నేనీ స్థాయికి ఎదిగాను. నేను పుట్టింది ఆంధ్రలో అయితే.. చదువుకున్నది కర్ణాటకలో కాబట్టి ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి నేను ఆశించేది ఒక్కటే... ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి కుటుంబం గట్టెక్కుతుంది. చిన్నప్పటి కలెక్టర్ కావాలనే కోరిక నాలో బలంగా ఉంది. ఆ దిశగా కోచింగ్‌కు దాతలెవరైనా సహకారం అందించాలని కోరుతున్నా.

– దీపిక, అంధుల మహిళా క్రికెటర్

క్రమశిక్షణకు మారు పేరు 'ఎన్‌సీసీ'



మాట్లాడుతున్న కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా

కూడేరు: ఎన్‌సీసీ అంటే ఐక్యత, క్రమశిక్షణకు మారు పేరని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా అన్నారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–6 ఆంధ్రా బెటాలియన్ శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాడెట్లనుద్దేశించి కమాండర్ ముంద్రా మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు, సేవా గుణం, ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ క్యాడెట్ల జీవితంలో టర్నింగ్ పాయింట్ అవుతుందన్నారు. కార్యక్రమంలో మేజర్ సుఖ్‌దేవ్ సింగ్, అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 525 మంది క్యాడెంట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీలో మరో ఐదుగురు డైరెక్టర్ల నియామకానికి చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ యం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గంలో మరో ఐదుగురు ప్రొఫెషనల్ డైరెక్టర్లుగా నియమించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం స్థానిక డీసీసీబీ హాలులో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ... ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెషనల్ డైరెక్టర్లు ఉండగా మరో ఐదుగురి నియామకానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే సహకార సంఘాల్లోనూ ఐదుగురు ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దివ్యాంగురాళ్లపై అత్యాచార యత్నం

నల్లచెరువు: మండల కేంద్రంలోని యల్లమ్మ వీధిలో నివాసముంటున్న ఇద్దరు దివ్యాంగ (మూగ) మహిళలపై అదే వీధికి చెందిన అంజి, వెంకటేష్ అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం రాత్రి మూగ మహిళలిద్దరూ ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించిన అంజి, వెంకటేష్ వారిపై అత్యాచారానికి ప్రయత్నించారు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఇద్దరినీ పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసుకలు అప్పగించారు. బాధితురాళ్ల పెద్దమ్మ లలితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తచెరువు: బుక్కపట్నం మండలం నారసింపల్లి తండాకు చెందిన అశోక్‌నాయక్ (36) అనుమానాస్పద స్థితిలో చెరువు నీటిలో మృతదేహమై తేలాడు. కొత్తచెరువు ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలోని కెనరాబ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న అశోక్‌నాయక్‌కు భార్య నిమితాబాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుక్కపట్నం కట్ట నడిమికొండ సమీపంలో చెరువు నీటిలో గురువారం ఉదయం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిని అశోక్ నాయక్‌గా గుర్తించారు. బుధవారం రాత్రి చెరువులో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. కాగా, అశోక్‌కుమార్ శరీరంపై, తలపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక సరిహద్దున బస్సు ప్రమాదం

హిందూపురం అర్బన్: బెంగళూరు నుంచి ధర్మవరానికి ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేట్ బస్సు (వెంకటేశ్వర) గురువారం రాత్రి కుడమలకుంట (కర్ణాటక సరిహద్దు) వద్ద లారీ ఢీకొంది. బస్సులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. బస్సు ముందు భాగంలో కూర్చొన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గౌరిబిదనూరులోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు.

ధర్మవరం ఫ్లైఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్

- రూ.50 కోట్లు మంజూరు
- రాయదుర్గంలో రెండు పనులకు రూ.26 కోట్లు

అనంతపురం టవర్‌క్లాక్: ధర్మవరం పట్టణంలో కదిరి గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు నూతనంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ధర్మవరం నుంచి అనంతపురం వైపు రోజూ వందలాది వాహనాలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తూ రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబులరెడ్డి తెలిపారు. త్వరలోనే టెండర్లు ఖరారు చేసి బ్రిడ్జి పనులు మొదలు పెడతామన్నారు. అలాగే రాయదుర్గం నుంచి గలగల, తాళ్లకెర గ్రామాల మీదుగా కూడ్లిగి వెళ్లే రహదారి, రాయదుర్గం – భూపసముద్రం రహదారి ఆధునికీకరణకు కలిపి మొత్తం రూ. 26 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

త్వరలో ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసేందుకు కీలకమైన సాగునీటి సలహా మండలి సమావేశం (ఐఏబీ) నిర్వహణకు హెచ్చెల్సీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆమోదం కోసం ఫైల్ పంపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషాశ్రీచరణ్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో సమావేశం నిర్వహించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి.

విధుల్లో విఫలం.. ఫలితం వీఆర్!

- నేర నియంత్రణలో 'పురం' పోలీసుల నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో అలసత్వం
- ఉన్నతాధికారుల ఆగ్రహం
- సీఐలను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు



హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు కట్టు తప్పారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీనిపై నిఘా వర్గాల ద్వారా కూడా నివేదికలు అందడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్‌టౌన్, రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీఐలను వీఆర్‌కు పంపుతూ రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు.

దొంగతనాలపై రిక'వరీ'..

హిందూపురం డీఆర్ కాలనీలో రెండు నెలల క్రితం వరుస చోరీలు జరిగాయి. ఆర్టీసీ కాలనీలో ఓ మహిళా ఉపాధ్యాయురాలి ఇంట్లో 400 గ్రాముల బంగారం, రూ.50 వేలను దొంగలు దోచుకెళ్లారు. అజంతా లాడ్జి సమీపంలో ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ వ్యక్తి స్కూటర్‌లో ఉంచిన రూ.5 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇటీవల లేపాక్షి సమీంలో టిప్పర్ ఆపి డ్రైవర్‌ను బెదిరించి డబ్బు లాక్కెళ్లారు. ఈ సంఘటనలపై పోలీసులు కేసుల నమోదుకే పరిమితమయ్యారు. రికవరీలు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఇక.. రైస్ పుల్లింగ్ తయారీ వస్తువుల కేసులో వన్‌టౌన్ పోలీసులు ఇటీవల పలువురిని అరెస్ట్ చేసినా కీలక సూత్రధారిని మాత్రం పట్టుకోలేదు. ముద్దిరెడ్డిపల్లి, తూమకుంట పారిశ్రామికవాడ సమీపంలో పేకాట జోరుగా జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పట్టణానికి నలువైపులా మట్కా, మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా ఆడుతున్న పలువురిని సెబ్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సమయంలో సీఐలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే వన్‌టౌన్ సీఐ ఈరన్న పలు వివాదాస్పద విషయాల్లో తలదూర్చినట్లు ఆరోపణలు రావడం, రూరల్ సీఐ వేణుగోపాల్ సైతం పలువురు ప్రతిపక్ష ముఖ్య నాయకులతో సన్నిహితంగా ఉన్నారనే విమర్శలు వినిపించాయి. ఈ విషయాలపై డీఎస్పీ కంజాక్షన్ తరచూ హెచ్చరిస్తున్నా వారు పట్టించుకోలేదని విశ్వసనీయ సమాచారం. వీటన్నింటిపైనా నివేదికలు సేకరించిన ఉన్నతాధికారులు.. చివరకు ఇద్దరు సీఐలను వీఆర్‌కు సాగనంపినట్లు తెలిసింది.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



హిందూపురం సబ్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. అసాంఘిక కార్యకలాపాలను అణచివేస్తున్నాం. పట్టణంలో సీఐలు ఇప్పటి వరకు ఎవరికి వారు అన్నట్లు వ్యవహరించారు. ఇక అలా కుదరదు. నాతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుంది.

– కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

రేపు వాహనాల వేలం

పుట్టపర్తి టౌన్: పలు కేసుల్లో పట్టబడిన వాహనాలను శనివారం హిందూపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెట్ బ్యూరో (సెబ్) పోలీసుస్టేషన్‌లో వేలం వేస్తున్నారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 11గంటలకు వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. ధరావతు చెల్లించి పాటదారులు పాల్గొనాలి.

కోలుకుంటున్న నల్లనాగు బాధితుడు

పెనుకొండ: స్థానిక ట్రామా కేర్ సెంటర్‌లో బుధవారం చొరబడిన నల్లనాగును బంధించే క్రమంలో కాటుకు గురైన రాజు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోంది. ఈ మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రి వైద్యులు గురువారం వెల్లడించారు. పాముకాటు కారణంగా ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. గురువారం కొంత మేర కోలుకున్న రాజు.. కుటుంబ సభ్యులను సైగలతో పలకరించాడు.

గ్రంథాలే శాస్త్రసాంకేతిక విద్యకు మూలం



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి

అనంతపురం: ఆధునిక శాస్త్ర సాంకేతిక విద్యా వ్యవస్థకు మూలం పూర్వీకులు సంస్కృతంలో రచించిన గ్రంథాలేనని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి అన్నారు. ప్రపంచ సంస్కృత దినోత్సవాన్ని సంప్రదాయం ఉట్టిపడేలా గురువారం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. సుశ్రుతుడు రచించిన గ్రంథం ఆధారంగానే సర్జరీలు మొదలయ్యాయన్నారు. అనేక ముఖ్యమైన వైజ్ఞానిక, గణిత భావనలను శతాబ్దాల క్రితమే సంస్కృత గ్రంథాలు మొదట పేర్కొన్నాయన్నారు. అలాంటి పూర్వీకుల మేథోసంపత్తిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైజ్ఞానిక సాహిత్యంలో అనేక ఆధునిక భాషలు నేరుగా సంస్కృతం నుంచి తీసుకున్నవేనన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ సంస్కృత విద్యా కేంద్రం అధ్యాపకులు డాక్టర్ విశాల్ ప్రసాద్ భట్ పాల్గొన్నారు.

రూ.వంద కోట్లతో విద్యుత్ పనులు

అనంతపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా రూ. 23 కోట్ల వ్యయంతో విద్యుత్ తీగల మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మరమ్మతుకు గురైన విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్తవి ఏర్పాటుతో పాటు నూతనంగా విద్యుత్ తీగలను లాగనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని కణేకల్, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగల ఏర్పాటు ప్రక్రియ సాగుతున్నట్లు వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు 37 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉమ్మడి జిల్లాకు మంజూరు చేస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులను జారీ చేశారన్నారు. ఇందుకు కోసం రూ.82 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న రెండు నెలల్లో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే రైతులతో పాటు గృహ అవసరాల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

శింగనమల: వీధి కుక్కలు దాడిచేయడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. మరో 20 తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు... శింగనమలకు చెందిన సుబ్రహ్మణ్యం గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం మేపు నుంచి గొర్రెల మందను ఇంటికి మళ్లిస్తుండగా మార్గమధ్యంలో వర్షం అధికమైంది. దీంతో గొర్రెలు చెల్లాచెదురవుతూ చిన్న కాలువ సమీపంలోకి చేరుకున్నాయి. అదే సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. వర్షం తగ్గిన తర్వాత చెల్లాచెదురైన గొర్రెలను ఒకచోటుకు చేర్చేందుకు కాపరులు సిద్ధమయ్యారు. చిన్నకాలువ సమీపంలోకి చేరుకోగానే కుక్కల దాడిలో మృతి చెందిన 15 గొర్రెలు కనిపించాయి. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరో 20 గొర్రెలను అతి కష్టంపై గ్రామంలోకి తరలించారు. సమాచారం అందుకున్న గోపాలమిత్ర అక్కడకు చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్స అందజేశారు.